క్లుప్తంగా

తిరుపతమ్మ వారి దీక్షాస్వాముల నగర సంకీర్తన



దీక్షాస్వాముల నగర సంకీర్తన

పెనుగంచిప్రోలు: గ్రామంలో మంగళవారం శ్రీతిరుపతమ్మ వారి మండల దీక్షాస్వాముల నగర సంకీర్తన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. టౌన్ సెంటర్‌లోని శ్రీఆంజనేయస్వామి వారి ఆలయం వద్ద నుంచి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఏర్పాటు చేసిన నగర సంకీర్తన కార్యక్రమంలో దీక్షాస్వాములు, గురుస్వాములు, కోలాట, భజన బృందాల వారు పాల్గొన్నారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): గ్రామంలో ఉన్న ఆంజనేయ స్వామి వారి ఆలయ హుండీ కానుకల లెక్కింపు ఈ నెల 18న జరుగుతుందని ఆలయ ఈవో నాగరాజు మంగళవారం పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి దేవదాయ శాఖాధికారుల సమక్షంలో హుండీ కానుకల లెక్కింపు జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు పాల్గొనాలని కోరారు.

25న బహిరంగ వేలం పాటలు

ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలో ఉన్న భవానీ ముక్తేశ్వర స్వామి వారి ఆలయంలో ఈ నెల 25న పలు బహిరంగ వేలం పాటలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇన్‌చార్జ్ ఈవో నాగరాజు మంగళవారం తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు లడ్డూ, పటిక బెల్లం, కొబ్బరిచిప్పలు పోగు చేసుకునే హక్కుకు బహిరంగ వేలం పాటలు జరుగుతాయన్నారు. మహా శివరాత్రి పండుగ సందర్భంగా ఐదు రోజులకు గాను వేలం పాటలు నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు పాల్గొనాలని కోరారు.

ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులు అందజేత



ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: సంక్రాంతి సంబరాల్లో భాగంగా స్థానిక ఏడవ వార్డులో కౌన్సిలర్ పూసాల సీతారావమ్మ ఆధ్వర్యంలో ఈనెల 15,16 తేదీల్లో నిర్వహించిన ముగ్గుల పోటీలో విజేతలకు ఎమ్మెల్యే ఉదయభాను బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం వార్డులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఉదయభాను మాట్లాడుతూ మహిళలకు ప్రతి యేటా కౌన్సిలర్ సీతారావమ్మ ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్, కౌన్సిలర్లు మనోహర్, తన్నీరు నాగేంద్ర, మండల సమాఖ్య అధ్యక్షురాలు శ్యామల, స్థానిక నాయకులు కల్యాణం బాలకృష్ణ, మాబు సుభానీ, కాశి, నాగు, నాగరాజు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో ఖాళీ పోస్టుల భర్తీకి మౌఖిక పరీక్షలు



అభ్యర్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న అధికారులు

నందిగామ: డివిజన్‌లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టుల భర్తీకి స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ఆర్డీఓ రవీంద్ర రావు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.ఉమాదేవితో పాటు పలు శాఖలకు చెందిన అధికారుల సమక్షంలో అభ్యర్థులకు మౌఖిక పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ డివిజన్‌లో 5 కార్యకర్త పోస్టులకు 30 మంది, 16 సహాయకురాలి పోస్టులకు 76 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారిని ఇంటర్వ్యూ చేశామని తెలిపారు.

ముస్లింల సంక్షేమానికి జగన్ ప్రభుత్వం పెద్ద పీట

ప్రభుత్వ విప్ ఉదయభాను



ప్రభుత్వ విప్ ఉదయభాను, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఆసిఫ్ ఆలీని సన్మానిస్తున్న షాదీఖానా కమిటీ సభ్యులు

జగ్గయ్యపేట అర్బన్: ముస్లింల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేసి వారికి పెద్ద పీట వేసిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి, తదనంతరం ఆయన వారసుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. స్థానిక పోస్టాఫీసు సెంటర్‌లోని షాపింగ్ కాంప్లెక్స్‌లో మంగళవారం నూతనంగా ఏర్పాటుచేసిన వైఎస్సార్ సీపీ పట్టణ ముస్లిం మైనార్టీ విభాగం కార్యాలయాన్ని రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ అలీతో కలిసి ఉదయభాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ముస్లింలను కేవలం ఓటు బ్యాంకుగానే ఉపయోగించుకున్నాయని, వారి సంక్షేమానికి మొండిచేయి చూపించాయని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించి వారి పురోగతికి కృషి చేశారన్నారు. నేడు ఆయన బాటలోనే ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి అనేక పథకాలను అమలు చేయడంతో పాటు ఉన్నత పదవుల్లో స్థానాలను కల్పిస్తున్నారన్నారు.

● త్వరలో రూ.80 లక్షలతో నూతన షాదీఖానా

పట్టణంలో త్వరలో ముస్లింల కోసం రూ.80 లక్షల వ్యయంతో షాదీఖానా నిర్మించనున్నట్లు ఉదయభాను తెలిపారు. అందుకు సీఎం వైఎస్ జగన్ అంగీకరించారని, త్వరలో నిర్మాణం చేపడతామని చెప్పారు. మండలంలోని భీమవరం గ్రామంలో ఉన్న రెండు మసీదులకు తన తల్లిదండ్రుల పేరు మీద రూ.80 వేలు విరాళంగా అందజేస్తున్నట్లు హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఒకరికి, కోఆప్షన్ సభ్యులుగా ఇద్దరు ముస్లింలకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఆసిఫ్ ఆలీ మాట్లాడుతూ నియోజకవర్గంలో ముస్లింలంతా ఎమ్మెల్యే ఉదయభానుకు అండగా నిలవాలని సూచించారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం అధ్యక్షుడు షేక్ మొహిద్దీన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, ముస్లిం మైనారీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు రస్ హుస్సేన్, ఏఎంసీ చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, షాదీఖానా చైర్మన్ ఎక్సైడ్ బాషా, సొసైటీ అధ్యక్షుడు బాలసైదా, ముస్లిం మైనార్టీ నాయకులు ఫిరోజ్‌ఖాన్, అక్బర్‌ఖాన్, జుబేర్, ఎస్‌ఎస్పీ సైదా, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాబు, అబ్దుల్ రజాక్, ఖాజా, షాబుద్దీన్, నాగుల్, హుస్సేన్, సుప్రీం కోర్టు లాయర్ హసద్, మత ప్రవక్త అబ్దుల్లా శాస్త్రి, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

పేటను మోడల్ పట్టణంగా రూపొందించడమే లక్ష్యం

ప్రభుత్వ విప్ ఉదయభాను



ధ్యానకేంద్రం శంకుస్థాపనలో పాల్గొన్న ఉదయభాను, యోగి సంపత సదానంద గిరి మహారాజ్

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్ది గొప్ప పర్యాటక కేంద్రంగా, మోడల్ పట్టణంగా నిలిచిపోయే విధంగా తయారు చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. పట్టణంలోని చెరువుబజారు రోడ్డులో ఉన్న బుద్ధ విహార్ పార్కులో గౌతమ బుద్ధ ధ్యానకేంద్రం నిర్మాణానికి మంగళవారం హిమాలయ యోగి సంపత సదానంద గిరి మహారాజ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో మాట్లాడుతూ నేటి ఆధునిక యాంత్రిక జీవనంలో మానసిక ఒత్తిడితో ఉన్నవారికి ధ్యానం ద్వారా ఉపశమనం లభిస్తుందన్నారు. జీవితంలో సవాళ్లను అధిగమించడానికి ధ్యానం సహాయపడుతుందన్నారు. చెరువు మధ్యలో ధ్యానకేంద్రం ఉండటం ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. ఈ చెరువును హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్, ఖమ్మంలోని లకారంలో మాదిరిగా అభివృద్ధి చేయాలనే విజన్‌తో ఉన్నట్లు చెప్పారు. అందులో భాగంగానే మొదటి విడతగా సుమారు రూ.5 కోట్లతో చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, గ్రీనరీ, లైట్లు, బోటు షికారు తదితర హంగులతో పర్యాటక కేంద్రంగా రూపొందించనున్నామని ప్రకటించారు. ఈ చెరువు సమీపంలోనే ఉన్న ధనంబోడుపై గౌతమ బుద్ధుని దంతం, శిలాశాసనాలు కూడా ఉన్నందున ఈ ప్రాంతాన్ని బౌద్ధక్షేత్రంగా అభివృద్ధి చేయాలని భావిస్తున్నట్టు చెప్పారు. అయితే రైల్వే ట్రాక్ మీదుగా పైకి రోడ్డు వేయాలంటే రైల్వేశాఖ అనుమతి కావాల్సి ఉన్నందున జాప్యం జరుగుతోందన్నారు. అనుమతి రాగాగే కొండ పైన రీడింగ్ రూమ్, పార్కు ఏర్పాటు చేస్తామన్నారు.

ధ్యానంతో ఆరోగ్య సిద్ధి

హిమాలయ యోగి సంపత సదానంద గిరి మహారాజ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఉదయభాను సేవా కార్యక్రమాలు అద్భుతంగా ఉన్నాయని, నేటి రాజకీయ నాయకులు ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. జీవితంలో ఏదైనా సాధించాలంటే పరిపూర్ణ విశ్వాసం కావాలని, అది ధ్యానం వలన లభిస్తుందన్నారు. ధ్యానం వలన ఆరోగ్యం, ఆయుష్మానం, ఆనందం లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు వట్టెం మనోహర్, గింజుపల్లి వెంకట్రామయ్య, ఖాదర్ బాబు, పసుపులేటి రాధాసుబ్రహ్మణ్యం, న్యాయవాది సత్యశ్రీనివాస్, ధ్యానరత్న వెలగపూడి లక్ష్మణరావు, తమ్మీంద్రు నాగేశ్వరరావు, మీసాల బాలాజీ, మల్లికార్జునరావు, వసంత టెంట్‌హౌస్ ప్రసాద్, వాసవీ క్లబ్ సభ్యులు, ధ్యానకేంద్రం ప్రతినిధులు పాల్గొన్నారు.

కోడి పందేల శిబిరంపై పోలీసుల దాడి



పోలీసుల అదుపులో ఉన్న పందెం రాయుళ్లు, పుంజులు, వాహనాలు

నందిగామ: నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఎస్‌హెచ్‌ఓ సతీష్ అందించిన సమాచారం మేరకు మండల పరిధిలోని రాఘవాపురం గ్రామ శివార్లలో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో కలసి మంగళవారం ఎస్‌హెచ్‌ఓ దాడులు నిర్వహించారు. ఆ సమయంలో పందేలు వేస్తున్న 14 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.13,220 నగదు, 4 కోళ్లు, 5 ద్విచక్ర వాహనాలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరికొందరి వివరాలు కూడా సేకరిస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

కోడిపందేల నిర్వాహకులపై 55 కేసులు

నందిగామ: డివిజన్ పరిధిలో కోడి పందేల నిర్వాహకులపై 55 కేసులు నమోదు చేసినట్లు ఏసీపీ నాగేశ్వర్ రెడ్డి మంగళవారం తెలిపారు. 173 మంది వ్యక్తులపై కూడా కేసు నమోదు చేశామన్నారు. ఆయా కేసుల్లో 64 పుంజులు, 64 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటితోపాటు 22 వాహనాలు, రూ.1.23 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు.

క్రమశిక్షణకు మారుపేరు పరమేశ్వరరావు



పరమేశ్వరరావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా నూతలపాటి పరమేశ్వరరావు నిరంతరం ఉపాధ్యాయుల సమస్యలు, ఏపీటీఎఫ్ బలోపేతం గురించే ఆలోచించేవాడని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్) మాజీ అధ్యక్షుడు ఏ నరసింహారెడ్డి పేర్కొన్నారు. సిద్ధార్థ ఆడిటోరియంలో మంగళవారం నూతలపాటి పరమేశ్వరరావు ప్రథమ వర్ధంతి సభ జరిగింది. నరసింహారెడ్డి అతిథిగా హాజరై మాట్లాడారు. ఫెడరేషన్ బలోపేతం కోసం పరమేశ్వరరావు నిరంతరం కృషిచేశాడన్నారు. ఆయన మరణం ఫెడరేషన్‌కు తీరని లోటన్నారు. 1965 సంవత్సరంలో పరమేశ్వరరావు ఏపీటీఎఫ్‌లో చేరిన నాటి నుంచి ఫెడరేషన్ అభివృద్ధిలో భాగం అయ్యారన్నారు. జాతీయ విద్యావిధానం-పర్యవసనాలు అనే అంశంపై నరసింహారెడ్డి మాట్లాడారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల మాట్లాడుతూ పరమేశ్వరరావు తుది శ్వాస వరకు ఫెడరేషన్ గురించే ఆలోచించారన్నారు. పరమేశ్వరరావు ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగానే కాకుండా ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకుడిగా ఉపాధ్యాయుల కోసం అనేక వ్యాసాలు రాశారని చెప్పారు. ఆయన వ్యాసాలు రాయడమే కాకుండా ఉత్సాహవంతులైన వారితో ఆ పత్రికకు వ్యాసాలు రాయించేవారని గుర్తుచేశారు. ఫెడరేషన్‌ను సమర్థవంతంగా నిర్వహించే కార్యకర్తల కోసం ఆయన నిత్యం అన్వేషణ చేసి, గుర్తించిన వారిని సుశిక్షితులైన సభ్యులుగా తీర్చిదిద్దేవారన్నారు. తొలుత పరమేశ్వరరావు చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు, వివిధ జిల్లాల నుంచి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెన్షన్ రివిజన్ చేయాలి

బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

మధురానగర్(విజయవాడసెంట్రల్): బీఎస్ఎన్ఎల్ పింఛన్‌దారులకు పెన్షన్ రివిజన్ చేయాలని కోరుతూ మంగళవారం ఆలిండియా ఆ సంస్థ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపుమేరకు చుట్టుగుంట బీఎస్ఎన్ఎల్ భవన్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి వి.వరప్రసాద్ మాట్లాడుతూ 2017 జనవరి 1వ తేదీ నుంచి పెన్షన్ రివిజన్ చేయాల్సి ఉండగా ఐదు సంవత్సరాలు దాటిన తరువాత కూడా పెన్షన్ రివిజన్ చేయకపోవడం విచారకరం అన్నారు. కేంద్ర ప్రభుత్వ పింఛన్‌దారులుగా తమను పరిగణించినప్పటికీ సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగుల మాదిరిగా పెన్షన్ రివిజన్ చేయకపోవడం దురదృష్టకరం అన్నారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు ఎంఆర్ఎన్ ప్రకాశరావు, పూర్ణచంద్రరావు, భాస్కరరావు, కోటేశ్వరరావు, కేశవరావు, శివరామకుమార్, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

అగస్త్య పీఠాన్ని సందర్శించిన యోగి నరసింహగిరి



బొమ్మిశెట్టి, సుగుణానంద స్వామీజీతో యోగి నరసింహ గిరి స్వామీజీ

నరసింహారావుపాలెం(వీరులపాడు): హిమాలయాలలో తపస్సు చేసిన యోగి నరసింహ గిరి స్వామీజీ మంగళవారం మండలంలోని నరసింహారావుపాలెం గ్రామంలో ఉన్న అగస్త్య పీఠాన్ని సందర్శించారు. పీఠాధిపతి సుగుణానంద స్వామీజీతో కలిసి పీఠంలోని గాయత్రీమాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణ ప్రచారంలో భాగంగా పీఠాన్ని సందర్శించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కర రావు, మైత్రి ఫౌండేషన్ అధ్యక్షుడు త్రినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానవాళి రక్షణకు రక్తం చిందించిన యేసు

జగన్నాథపురం(వీరులపాడు): మానవాళి రక్షణకు ప్రభువైన యేసుక్రీస్తు శిలువపై రక్తం చిందించారని విజయవాడ బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు అన్నారు. మండలంలోని జగన్నాథపురం గ్రామంలో నిత్య సహాయ మాత ఆలయంలో మంగళవారం వార్షిక మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యేసు క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరికీ అనుసరణీయమైనవన్నారు. అనంతరం యేసుక్రీస్తు విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఊరేగించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బండి విజయ్‌పాల్ రెడ్డి, ఫాదర్ సుగుణరావు, పలువురు ఫాదర్‌లు, ప్రజలు పాల్గొన్నారు.


గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కంచికచర్ల: పోలియోతో బాధపడుతున్న ఓ వ్యక్తి గడ్డి మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలో జరిగింది. ఎస్ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం కథనం మేరకు మండలంలోని గనిఆత్కూరు గ్రామానికి చెందిన యాటగిరి జక్కయ్య(34) గ్రామంలో ఓ కోళ్ల ఫారంలో పని చేస్తున్నాడు. పోలియో వ్యాధిగ్రస్తుడు కావడంతో తీవ్ర మనస్తాపంతో ఈనెల 15వ తేదీన కోళ్లఫారంలో ఉన్న గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వైద్యం కోసం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి ఈనెల 16న తరలించారు. చికిత్స పొందుతూ 17వ తేదీ మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

22న అక్కినేని ఫౌండేషన్ ప్రతినిధుల సమావేశం

విజయవాడ కల్చరల్: అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవాలు ఈ ఏడాది సెప్టెంబరు 20వ తేదీన ప్రారంభమవుతున్న సందర్భంగా అక్కినేని జాతీయ ప్రతినిధుల సమావేశాన్ని ఈ నెల 22వ తేదీ ఉదయం 11 గంటలకు విజయవాడ గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించనున్నట్లు అక్కినేని ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు న్యాయవాది చీదెళ్ల నాగేశ్వరరావు తెలిపారు. గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో మంగళవారం ఆయన నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు, ప్రవాసాంధ్రుల అక్కినేని అభిమాన సంఘాల సభ్యులు ఈ సమావేశంలో పాల్గొంటారని ఆయన తెలిపారు. అక్కినేని శత జయంతి ఉత్సవాలను సమైక్యతా వేదికగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు చెప్పారు. అనంతరం శతజయంతి వేడుకల పోస్టర్‌ను అతిథులు ఆవిష్కరించారు. సమావేశంలో వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు డేవిడ్‌రాజు, చింతకాయల చిట్టిబాబు, ఎ.ప్రభు, జోషి, సీహెచ్ నరసింహారావు పాల్గొన్నారు.

● తిరుగుపయనం



తెలుగు వారి పెద్ద పండుగ సంక్రాంతి పర్వదినం మూడు రోజుల పాటు స్వగ్రామాల్లో కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకొన్న ప్రజలు మంగళవారం తిరుగుబాట పట్టారు. దీంతో కంచికచర్ల మండలం కీసర టోల్‌ప్లాజా వద్ద కార్లు, ఇతర వాహనాలు బారులుదీరాయి. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 8,500 వాహనాలు హైదరాబాద్ వైపు వెళ్లాయని స్వర్ణ టోల్ ప్లాజా మేనేజర్ జయప్రకాష్ తెలిపారు. - కంచికచర్ల

జీవాలను వాటికి దూరంగా ఉంచాలి



బీటీ పత్తి ఆకులు, కాయలు తింటున్న జీవాలు

పెనుగంచిప్రోలు: పొలాల్లో బీటీ కాటన్ ఆకులు, కాయలు తినటం వలన పశువులు, జీవాలు దగ్గు, జలుబు, నల్లకప్పు వచ్చి 3 నుంచి 5 రోజుల్లో మరణిస్తాయని, జీవాలను వాటికి దూరంగా ఉంచాలని పశువైద్యాధికారి అనిల్ హెచ్చరించారు. దీనికి సంబంధించి లక్షణాలు, నివారణ చర్యలను ఆయన వివరించారు. ముఖ్యంగా ఊపిరితిత్తులు, కాలేయం దెబ్బతిని 5 రోజుల లోపు చనిపోతాయని, ఈ మరణాలు ఎక్కువగా మేకల్లో ఉంటాయన్నారు. జలుబు, దగ్గు లక్షణాలను బట్టి నట్టల వల్ల అని భావించి రైతులు నట్టల మందు తాగిస్తారని, కాని ఇది సరైన పద్ధతి కాదన్నారు. నట్టల మందు తాగించటం వల్ల జీవాలు మరింత నీరసించి వెంటనే చనిపోతాయన్నారు. కొన్ని రోజుల పాటు చీడపీడలు రాకుండా బీటీ మొక్కలకు శక్తి ఉంటుందని, అటువంటి బీటీ మొక్కల ఆకులు, కాయలు జీవాలు తినటం వలన గాసిఫాల్ అనే విష పదార్థం వాటి శరీరంలోకి వెళ్లి అవి జబ్బు పడతాయని చెప్పారు. రైతులు అవగాహనతో ప్రత్యామ్నాయ గడ్డిని అందించాలన్నారు. స్టైల్లో హెమాటా అనే గింజలు గట్ల మీద, ఖాళీ స్థలాల్లో వేసుకుంటే జీవాలకు మంచి గడ్డి వస్తుందని సూచించారు.

లక్షణాలు...

- విష పదార్థం వలన గొర్రెలు, మేకల్లో కడుపు ఉబ్బటం, పొరటం వంటి వ్యాధులు సంభవిస్తాయి.
- నోటి వెంట సొంగ కారుతుంది.
- ఊపిరితిత్తులు, కాలేయం దెబ్బతిని 4, 5 రోజుల్లో మరణిస్తాయి.



పశువైద్యుడు అనిల్

నివారణా చర్యలు...

- సాధ్యమైనంత వరకు రైతులు బీటీ పత్తి ఆకులు, కాయలు తినకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఒకవేళ తిన్న తరువాత జలుబు, దగ్గు లక్షణాలు కనిపిస్తే ఎట్రోఫిల్ సల్ఫేట్, ఎవిల్, ప్రెగ్నిజిలోన్ వంటి మందులు వాడాలి. లివర్ డీ టాక్సిఫికేషన్ మందులు వాడాలి.

విశ్రాంత ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ



విశ్రాంత ఉద్యోగుల సంఘ డైరీని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర డైరీ కమ్ గైడ్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను మంగళవారం ఆవిష్కరించారు. పోస్టాఫీసు సెంటర్‌లోని సంఘ కార్యాలయంలో సంఘ అధ్యక్షుడు గంధం శేషగిరిరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉదయభాను ఆవిష్కరించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘ సహాధ్యక్షుడు మాదిరాజు కేశవరావు, ఉపాధ్యక్షులు టీఎస్ఆర్ ఆంజనేయులు, సంబంగి రంగారావు, విజయకుమార్, కార్యదర్శి అబ్బాస్ ఆలీ, కోశాధికారి శంకరరావు, ప్రతినిధులు జంపాల నాగేశ్వరరావు, జోసఫ్, కర్లపాటి వెంకటేశ్వర్లు, రామారావు, జయరావు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతులు



షటిల్ పోటీల్లో విజేతలతో నిర్వాహకులు

విజయవాడ రూరల్: కొత్తూరు తాడేపల్లిలో ఈవీఈ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి నాన్ మెడలిస్టుల అవుట్‌డోర్ షటిల్ బ్యాడ్మింటన్‌లో కొత్తూరు తాడేపల్లి టీము విన్నర్‌గా నిలిచింది. సీనియర్స్ విభాగంలో విజయ్, సతీష్, టీము, జూనియర్స్ విభాగంలో ఫణి, సూర్య విజేతలుగా నిలిచారు. మూడు రోజులపాటు నిర్వహించిన ఈ పోటీలు సోమవారం రాత్రితో ముగిశాయి. సీనియర్స్ ఫైనల్స్‌లో కొత్తూరు తాడేపల్లికి చెందిన భాను, కళ్యాణ్‌లపై అదే గ్రామానికి చెందిన విజయ్, సతీష్ విజయం సాధించి టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. జూనియర్స్‌లో విజయవాడకు చెందిన తేజ, సోను టీముపై కొత్తూరు తాడేపల్లికి చెందిన ఫణి-సూర్య విజేతలుగా నిలిచారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కారెంపూడి కృష్ణకుమారి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈవీఈ ఫ్రెండ్స్ సర్కిల్ చైర్మన్, ఇంజినీర్ ఈడా వేదాద్రి, త్రివేణి కాలేజి (జి.కొండూరు)ప్రిన్సిపాల్ పామర్తి శ్రీనివాసరావు, హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు ఎం.మురళీ, అతిథులు పలగాని ప్రసాద్, సీహెచ్.శ్రీచ్, హరీష్, పి.రంగనాయకులు, పులి నాగమల్లేశ్వరావు, ఎం.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ అసిస్టెంట్‌కు సాయం



అంబికకు సాయం అందిస్తున్న ఎంపీపీ పాలడుగు జోత్స్న తదితరులు

ఇబ్రహీంపట్నం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన కేతనకొండ సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ అంబికకు రూ.65 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. మంగళవారం ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ పాలడుగు జోత్స్న, ఎంపీడీవో రామకృష్ణ నాయక్ చేతుల మీదుగా ఈ నగదు ఇచ్చారు. ఈనెల 8న తన సోదరుడి బైక్‌పై వెళ్తూ ప్రమాదానికి గురైంది. వైద్య ఖర్చుల నిమిత్తం ఎంపీపీ పాలడుగు జోత్స్న రూ.5 వేలు, సర్పంచి నళిని ఆశాలత రూ.5 వేలు, ఎంపీటీసీ రామకోటేశ్వరరావు రూ.5 వేలు, పీఏసీఎస్ అధ్యక్షుడు సయ్యద్ జానీ రూ.5 వేలు, వైస్ ఎంపీపీ బండి నాగమణి రూ.3 వేలు, కోఆప్షన్ సభ్యుడు పఠాన్ నాగుల్ మీరా రూ.3 వేలు, మండల కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది రూ.39 వేలు మొత్తం రూ.65 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. నాయకులు పాల్గొన్నారు.